# కరుణించిన కానిస్టేబులు



## గుత్తుల భాస్కరరావు

మా ఊళ్ళో పోలీసులు డబుల్ రైడింగ్ కేసునంతగా పట్టించుకోరు. ఎక్కినవాడూ తొక్కేవాడూ సకాలంలో దిగిపోతే క్షమించి వదిలేస్తారు. నిర్లక్ష్యంగా తొక్కుకుపోయేవాళ్ళని మాత్రం నిలేసి మర్డర్ కేసు బనాయించినంత పని చేస్తారు.

కానిస్టేబుల్ రెండువందల నలభై కి, ఆ రోజు అటువంటి కేసే తగిలింది. పక్కనుంచి యిద్దరు యువకులు సైకిల్ మీద రయ్‌మని దూసుకుపోతున్నారు. విజిల్ కొట్టి ఉక్కిరిబిక్కిరిచేసి వాళ్ళని ఆపేశాడు. ఎక్కినవాడు బార్ మీద అలానే కూర్చుంటే తొక్కేవాడు సైకిల్ పుచ్చుకొని జాలిగా నిలబడ్డాడు. 'క్షమించండి! పొరపాటయింది' అని బతిమాలాడు. కానిస్టేబులు ససేమిరా వినలేదు. 'పోలీసంటే అంత లోకువా. రండి స్టేషన్‌కి' అని హుంకరించేడు. ఇంత జరిగినా బార్ మీద కూర్చున్న వ్యక్తి దిగలేదని మండిపడి జబ్బపుచ్చుకొని దిగలాగాడు.

అంతే!

అతను కుప్పలా కింద కూలిపోయాడు. ఆ దృశ్యంచూసి జనం బిలబిలమంటూ గుమికూడారు. కానిస్టేబులు కంగారుపడిపోయి తొక్కే వ్యక్తివంక చూశాడు. అతను కళ్ళనీళ్లు పెట్టుకొని 'మామూలు మనిషనుకొని జబర్దస్తీచేశారు. కానీ యితని కాళ్ళు చిన్నతనంలోనే పడిపోయాయి. నడవలేడు. కనీసం నిలబడలేడు. ఇతనికి నేనూ, నా సైకిలే ఆధారం' అని వాపోయాడు.

కానిస్టేబులువంక జనం కోపంగాచూసి అతన్ని సాయంపట్టి సైకిల్ బార్ మీద కూర్చోబెట్టారు. కానిస్టేబిలు కూడా జాలిపడి తొక్కేవ్యక్తి భుజంతట్టి 'చూడబ్బాయ్, డబుల్ రైడింగ్ నేరమేకాదు. ప్రమాదంకూడా. అతన్నెక్కించుకొని తొక్కవద్దు. సైకిల్ నడిపించుకెళ్ళు' అని హితవు చెప్పాడు.

జనం సర్దుకున్నారు. అతను సైకిలు నడిపించుకొని వెళ్తుంటే బాధగా చూస్తుండిపోయారు. రెండువందల నలభై బాగా దూరమయ్యాడు. ఉన్నట్టుండి బార్ మీద కూర్చున్నవాడు కిందికి ఉరికి బట్టలు దులుపుకొని నడిపించేవాణ్ణి ఎక్కించుకొని తుర్రుమన్నాడు.

---